సాక్షి జగిత్యాల

బుధవారం | 20 | సెప్టెంబర్ | 2023



జగిత్యాలలో పూజలు చేస్తున్న సంజయ్ దంపతులు, మట్టి గణపతి వద్ద..





కోరుట్లలో వినాయకుని వద్ద యువకులు



రాయికల్‌లో



జగిత్యాలలో..



ధర్మపురిలో..

విఘ్నాలు తొలగించు వినాయకా..

జగిత్యాలటౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిదిరోజుల పాటు నిత్యం పూజలు అందుకునే గణనాథుని కోసం మంటపాలను ముస్తాబు చేసిన నిర్వాహకులు.. విద్యుత్ దీపాలు అలంకరించారు. పండ్లు, పూలతో పూజలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గోల్డెన్ యూత్ 40అడుగుల మట్టి భారీ గణపతి విగ్రహం ప్రతిష్ఠించింది. పల్లెల్లోనూ మట్టిగణపతి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

న్యూస్‌రీల్

క్రీడాపోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన పొరండ్ల విద్యార్థులు

జగిత్యాలరూరల్: జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలకు పొరండ్ల, కల్లెడ, లక్ష్మీపూర్ గ్రామాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎంలు, పీఈటీలు మనోహర్, వెంకటలక్ష్మి, మద్దెల జరోజన తెలిపారు. పొరండ్ల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 15 మంది, కల్లెడ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 28 మంది, లక్ష్మీపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర విభాగాల్లో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు వివరించారు.

ఎమ్మెల్సీ కవిత ఒత్తిడితోనే..



దావ వసంత

జగిత్యాలజోన్: ఎమ్మెల్సీ కవిత ఒత్తిడి మేరకే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించిందని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జెడ్పీ కార్యాలయంలో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కవిత ఢిల్లీ గడ్డపై ఉద్యమం చేయడంతోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించక తప్పలేదని ఆమె పేర్కొన్నారు. దీంతోపాటు ఓబీసీ రిజర్వేషన్ బిల్లును కూడా తీసుకు రావాలని దావ వసంత కోరారు.

మహిళా బిల్లు చారిత్రకం



భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లును ప్రధాని మోదీ నేతృత్వంలోని కేబినెట్ ఆమోదించడంతోపాటు నారీశక్తికి వందనం అభియాన్ పేరుతో బిల్లు తీసుకురావడం చరిత్రాత్మకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. బీజేపీ ప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుందని హర్షం వ్యక్తం చేశారు.

అందరికీ వర్తింపజేయాలి



సముదాయిస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

మల్లాపూర్(కోరుట్ల): సాతారంలోని దళితులు మంగళవారం రాయికల్–మెట్‌పల్లి రోడ్డుపై ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ, గ్రామసభ నిర్వహించకుండా, దరఖాస్తులు స్వీకరించకుండానే లంచాలు తీసుకుని 14మందిని ఎంపిక చేశారని ఆరోపించారు. సమాచారం అందుకున్న ఎస్సై నవీన్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



మెడల్స్‌తో యువకులు

కోరుట్ల: పట్టణానికి చెందిన ఠాకూర్ పృథ్వీరాజ్, గోరు సాయిచైతన్య పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో తొలిసారి జరిగిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఇద్దరు యువకులు గోల్డ్‌మెడల్ సాధించారు. తల్లిదండ్రులు, యువకులు వారిని అభినందించారు.

మారుతీస్వామి సస్పెన్షన్‌పై స్టే

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ తిరుకోవేళూర్ మారుతీస్వామి సస్పెన్షన్‌ను నిలిపివేస్తున్నట్లు హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆగస్టు 9న హుండీల లెక్కింపు సందర్భంగా.. ఫౌండర్ ట్రస్టీ మారుతీస్వామి ఆభరణాలు చోరీ చేశారని ఈవో, దేవాదాయ శాఖ కమిషనర్‌కు ధర్మకర్త జున్న సురేందర్ ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖ విచారణ చేపట్టి చైర్మన్‌ను సస్పెండ్ చేసింది. అయితే, చైర్మన్ కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నట్లు తెలిపారు.

మహిళా బిల్లు లీడర్లకు టెన్షన్!



తెరపైకి సతీమణులు

మహిళా బిల్లు ఇప్పటికప్పుడు అమలు చేయాల్సి వచ్చినా.. మన నేతలు నిరుత్సాహపడినా.. పోటీకి వెనకడుగు వేయడం, నియోజకవర్గం మారడం వంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. ఒకవేళ మహిళా బిల్లు అమలు చేయాల్సి వస్తే తమ భార్యలు, కూతుళ్లు, కోడళ్లను రంగంలోకి దింపాలని యోచిస్తున్నారు. మహిళా బిల్లు పార్టీలతో సంబంధం లేకుండా అమలు చేయాల్సిన అంశం కాబట్టి, దీని అమలు ప్రభావం అన్ని పార్టీల్లో ఉంటుందనడంలో సందేహం లేదు. ఇప్పటికే తమ అభ్యర్థుల జాబితా ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ కూడా అభ్యర్థుల పేర్లు మార్చాల్సి రావొచ్చు. అలాగే, కాంగ్రెస్, బీజేపీలు కూడా బిల్లుకు అనుగుణంగా తమ జాబితాను రూపొందించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ పార్టీ నాయకుడైనా సరే తమకు కాకుంటే తమ ఇంట్లో ఆడవారికి ఇప్పించుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. తిరిగి గెలిచేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఈసారైనా అధికారంలోకి రావాలని ప్రతిపక్ష పార్టీలు గత పదేళ్లుగా నియోజకవర్గాల్లో రూ.కోట్లాది ఖర్చు చేశారు. తీరా మహిళా బిల్లు వారికి శరాఘాతంగా మారినా.. అమలు అనివార్యమైతే దానిని తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో తలమునకలయ్యారు.

- ఉమ్మడి జిల్లాలో నాలుగు స్థానాలు రిజర్వేషన్?
- నేతల సతీమణులు, కోడళ్లను తెరపైకి తెచ్చే యోచన
- అన్ని పార్టీల్లో ఆశావహుల ఆశలపై నీళ్లు
- 1951 నుంచి చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువే

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

మహిళా బిల్లు ప్రస్తావన ప్రకంపనలు రేపుతోంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే మన రాష్ట్రంలో ఎమ్మెల్యే ఆశావహులను జమిలీ ప్రకటన వెంటాడుతుండగానే మహిళా బిల్లు వార్త గుండెలపై పిడుగుపాటులా పడింది. మహిళా బిల్లుకు పార్లమెంటు ఆమోదం లాంఛనమైన వేళ ఈ చర్చ స్థానికంగా దుమారం రేపుతోంది. బిల్లు ఇప్పటికిప్పుడు అమల్లోకి వస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో ఏయే స్థానాలు రిజర్వేషన్ కిందకు వస్తాయి? అన్న లెక్కలు అప్పుడే మొదలయ్యాయి. అయితే, అదే సమయంలో మహిళా బిల్లును చూడకుండా అందులో పొందుపర్చిన అంశాలు అధ్యయనం చేయకుండా అప్పుడే నిర్ణయానికి రాలేమని సీనియర్ ఎమ్మెల్యేలు, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఒకవేళ నోట్ల రద్దు తరహాలో ప్రభుత్వం ఇప్పటికిప్పుడు అమలు చేస్తే మాత్రం ఉమ్మడి జిల్లా రాజకీయాలపై పార్టీలకు అతీతంగా ప్రభావం చూపడం గ్యారెంటీ అని కుండబద్దలు కొడుతున్నారు. ఇది నియోజవకరాల పునర్విభజన తర్వాత ఉంటుందా? లేదా ఇప్పుడే అమలు చేస్తారా? అనే దానిపై స్పష్టత లేదు.

పాత జిల్లా పరిస్థితి ఇదీ

ఉద్యమాల జిల్లాగా పేరొందిన పాత కరీంనగర్ జిల్లా ప్రజలు ఓటు రూపంలో తీర్పులు ఇవ్వడంలోనూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. మొత్తం మూడు పార్లమెంటు, 13 అసెంబ్లీ స్థానాలు ఉన్న పాత జిల్లాలో మహిళా రిజర్వేషన్ ఇప్పటికప్పుడు అమలు చేయాల్సి వస్తే.. కనీసం నాలుగు సీట్లు కేటాయించాల్సి వస్తుంది. ఇప్పటికే మానకొండూరు, చొప్పదండి, ధర్మపురి నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడు స్థానాలు. వీటికి అదనంగా మరో నాలుగు సీట్లను జనాభా దామాషాన మహిళలకు కేటాయించాల్సి వస్తుంది. అంటే.. మూడు ఎస్సీ, నాలుగు మహిళలకు కేటాయిస్తే ఆరు జనరల్ స్థానాలు అవుతాయి. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ పార్టీ 13 మంది అసెంబ్లీ స్థానాలకు 13 మంది అభ్యర్థులు పురుషులనే ప్రకటించింది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు 85 మంది దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు బీజేపీ అసెంబ్లీ అభ్యర్థుల జాబితా ఇంకా ఖరారు కాలేదు. బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ నుంచి పోటీకి పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. మహిళా బిల్లు అనివార్యమైతే ఇప్పటికే బరిలో ఉన్న సిట్టింగ్‌లు, పోటీ చేయబోయే ఆశావహుల (దాదాపు 150 మంది)కు ఈ బిల్లును శరాఘాతంగా భావిస్తున్నారు.

1951 నుంచి తక్కువే..

దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కరీంనగర్ జిల్లా నుంచి మహిళా ప్రాతినిధ్యం తక్కువే అని చెప్పాలి. దీనికి సామాజికంగా, రాజకీయంగా అనేక కారణాలు ఉన్నాయి. హైదరాబాద్ రాష్ట్రంలో 1951లో జరిగిన ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి జేఎం రాజమణి దేవి (ఎస్‌సీఎఫ్) వేదికపై విజయం సాధించారు. తర్వాత 1972 నుస్తులాపూర్ నియోజకవర్గం నుంచి ప్రేమలత దేవి (కాంగ్రెస్) విజయం సాధించారు. 1998లో విద్యాసాగర్‌రావు లోక్‌సభకు ఎన్నికవడంతో మెట్‌పల్లి అసెంబ్లీస్థానానికి రాజీనామా చేశారు. దీంతో కొమిరెడ్డి జ్యోతిదేవి (కాంగ్రెస్) మెట్‌పల్లి ఉపఎన్నికల్లో గెలిచారు. 1998, 1999 పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి ఎంపీగా డాక్టర్ సుగుణకుమారి రెండుసార్లు గెలిచారు. 2014లో చొప్పదండి నుంచి బొడిగె శోభ (టీఆర్ఎస్) ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. ప్రస్తుతం ప్రభుత్వం 33శాతం అమలు చేయాల్సి వస్తే ఈ లెక్కలన్నీ మారిపోతాయనడంలో సందేహం లేదు.

'స్పైసీ' పరేషాన్!

- లెక్కల్లో తేడా రూ.9 లక్షలు
- పూర్తిచేయాలని కంపెనీకి నోటీసులు
- లేకుంటే క్రిమినల్ కేసులు
- విత్‌డ్రాకు లబ్ధిదారులకు నో చాన్స్!
- నేడు మండల పరిషత్ సమావేశం



దేశాయిపేట స్పైసీ యూనిట్ షెడ్

కోరుట్ల/మేడిపల్లి: లాభదాయకమైన స్పైసీ యూనిట్ భీమారం మండలంలోని ఐదుగురు పేద దళిత కుటుంబాలకు చక్కని ఉపాధి మార్గం చూపుతుందన్న ఆశలు అడియాసలవుతున్నాయి. లబ్ధిదారుల్లో అవగాహన లోపం, పనుల నిర్వహణలో జాప్యం, రాజకీయ నాయకుల జోక్యంతో పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వచ్చాయి. చివరకు స్పైసీ యూనిట్ ఏర్పాటు అయోమయంలో పడింది. దీనికితోడు.. యూనిట్‌పై అవగాహన లేదని, తమకు ప్రత్యామ్నాయం చూపించాలని ముగ్గురు లబ్ధిదారులు విన్నవించడం గందరగోళానికి దారితీస్తోంది. బుధవారం మేడిపల్లి మండలం పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనున్న నేపథ్యంలో దళితబంధు స్పైసీ యూనిట్ అంశంపై ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు ఎలా స్పందిస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

లెక్కల్లో తేడా రూ.9 లక్షలు

- దళితబంధు కింద దేశాయిపేటలో ఏర్పాటు చేసే స్పైసీ యూనిట్‌లో అవతవకలు జరిగాయని లబ్ధిదారులే ఆరోపించారు.
- యూనిట్ ఏర్పాటు పనులు చేయిస్తామని తమ పేరిట కొంతమంది డబ్బులు డ్రా చేయించి, పనులు పూర్తిచేయలేదని లబ్ధిదారులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- దీంతో ఈ అంశంపై ఎస్సీ కార్పొరేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు.
- ఏడాదిన్నరలో స్పైసీ యూనిట్ ఏర్పాటు కోసం ఐదుగురు దళితుల ఖాతాల్లోకి రూ.29 లక్షల వరకు అధికారులు జమచేశారు.
- విడుదల చేసిన ఈ డబ్బులతో ఇప్పటివరకు స్పైసీ యూనిట్ కోసం నిర్మించిన షెడ్డు, లెవలింగ్.. ఇతరత్రా పనులు కోసం రూ.20లక్షల వరకు ఖర్చు చేసినట్లు అధికారుల విచారణలో తేలింది.
- మిగిలిన నిధులతో పనులు ఇప్పటికీ పూర్తికాలేదు.
- దీంతో స్పైసీ యూనిట్ పనులను చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్న సంస్థకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నాలుగు రోజుల క్రితం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.
- డబ్బులు విడుదల చేసిన మేరకు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని నోటీసుల్లో హెచ్చరించినట్లు తెలిసింది.

విత్‌డ్రాకు నో చాన్స్!?

దేశాయిపేట స్పైసీ యూనిట్‌లో భాగస్వాములైన ఐదుగురు లబ్ధిదారుల్లో ముగ్గురు తమకు వేరే యూనిట్‌లు కేటాయించాలని విన్నవించడం గమనార్హం. తమకు అవగాహన లేనియూనిట్ ఏర్పాటు పేరిట కొందరు రాజకీయ నాయకులు.. తమకు వచ్చిన నిధులను గోల్‌మాల్ చేశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే స్పైసీ యూనిట్ పనులు ప్రాథమిక దశలో ప్రగతిలో ఉన్న క్రమంలో దళితబంధు డబ్బులను వేరే యూనిట్లకు మార్చే అవకాశం లేదని తెలిసింది. ఈ క్రమంలో ఇటు దళితబంధు యూనిట్ పనులు పూర్తికాక, వేరే యూనిట్‌కు బదలాయించే అవకాశం లేక లబ్ధిదారులకు నష్టం వాటిల్లితే పరిస్థితి ఏమిటన్నదని ప్రశ్నార్థకంగా మారింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని స్పైసీ యూనిట్ లబ్ధిదారులకు నష్టం జరగకుండా మండల ప్రజాపరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధులు ఎలా వ్యవహరిస్తారనే దానిపై ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

నోటీసులు జారీచేశాం

దేశాయిపేట దళితబంధు స్పైసీ యూనిట్ పనుల ప్రగతిపై ఇటీవల విచారణ జరిపాం. జరిగిన పనులు, లబ్ధిదారులకు విడుదల చేసిన నిధులకు మధ్య రూ.9 లక్షల మేర వ్యత్యాసం వచ్చింది. డబ్బులు విడుదల చేసినా.. పనులు ఎందుకు పూర్తిచేయలేదని షెడ్ నిర్మాణానికి ఒప్పందం చేసుకున్న సంస్థకు ఇటీవల నోటీసులు జారీచేశాం. పనులు సకాలంలో పూర్తిచేయకుంటే కంపెనీపై కేసు నమోదు చేస్తాం.

– లక్ష్మీనారాయణ, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

సార్లూ.. ఇది తగునా!

- హెచ్ఆర్ఏ కోసం స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం
- దంపతులిద్దరికీ వేర్వేరు స్థానాల్లో పోస్టింగులు
- స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల్లో చేరేందుకు అనాసక్తి
- నిబంధనలకు తూట్లు అని నాన్‌స్పౌజ్ టీచర్ల ఆందోళన
- పాయింట్ల విషయంలో విద్యాశాఖ ఆదేశాలు బేఖాతరు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: గవర్నమెంట్ హెడ్‌మాస్టర్ (జీహెచ్ఎం) బదిలీల్లో అనేకవింతలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా స్పౌజ్(దంపతులు) పాయింట్ల విషయంలో భార్యాభర్తలిద్దరూ ఒకేచోట పనిచేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని, పాయింట్లు దుర్వినియోగానికి గురై దంపతులిద్దరూ వేర్వేరు చోట్ల పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవడం కలకలం రేపుతోంది. స్పౌజ్ కేటగిరీ కింద కేటాయించిన పాయింట్లు దుర్వినియోగమవుతున్నాయని నాన్ స్పౌజ్ టీచర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం జిల్లా కేంద్రాల్లో ఉండాలని, అధిక హెచ్ఆర్ఏ వస్తుందని, కుటుంబ సభ్యులకు చేరువగా ఉంటామని, కాంప్లెక్స్ పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సి రావడం, భార్య/ భర్త కింద పనిచేయడం ఇబ్బందిగా భావించడం తదితర కారణాలతో ఒకేచోట పనిచేసేందుకు ఇష్టపడటం లేదు. కానీ, పాయింట్లను మాత్రం వాడుకుని తమకు నచ్చినచోటుకు బదిలీ అవుతున్నారు. వాస్తవానికి స్పౌజ్ కేటగిరీ పాయింట్లను దుర్వినియోగం చేయకూడదని బదిలీలకు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల డీఈవోలు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. అయినప్పటికీ.. కొందరు జీహెచ్ఎంలు వీటిని బేఖాతరు చేస్తూ.. తమకు నచ్చిన చోటుకు బదిలీ అయ్యారు.

మచ్చుకు కొన్ని..

- ఓ మహిళా జీహెచ్ఎం భర్త హన్మకొండ జిల్లా పరకాల మండలంలో పనిచేస్తున్నారు. కానీ, ఆ మహిళా జీహెచ్ఎం పరకాల మండలంలో 4 ఖాళీలు ఉండగా వాటిని వదిలి పక్కనే ఉన్న హనుమకొండ మండలానికి బదిలీ అయ్యారు.
- కరీంనగర్ అర్బన్‌లో భర్త పనిచేస్తుండగా.. లేడీ జీహెచ్ఎం మాత్రం పక్కనే ఉన్న రుక్మాపూర్‌ను వదిలి హుజూరాబాద్ మండలానికి బదిలీ అయ్యారు.
- పెద్దపల్లి జిల్లాలో జీహెచ్ఎం జమ్మికుంటలోని తన భార్య వద్దకు కాకుండా.. శంకరపట్నం మండలం తాడికల్‌ను ఎంచుకోవడం చర్చనీయాంశమైంది.
- పెద్దపల్లి జిల్లాలోని మరో జీహెచ్ఎం భార్య వీణవంక మండలంలో పనిచేస్తున్నారు. కానీ, ఈయన అదే మండలంలోని గంగారం స్కూల్‌ను కోరుకోకుండా, శంకరపట్నం మండలం కన్నాపూర్‌ను ఎంచుకున్నారు.
- జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలో ఓ మహిళా జీహెచ్ఎం భర్త అదే మండలంలో పనిచేస్తున్నారు. సదరు జీహెచ్ఎం ఆ మండలాన్ని వదిలి స్పౌజ్ పాయింట్ల సాయంతో మేడిపల్లి మండలం దమ్మన్నపేట ఎంచుకున్నారు.
- సిరిసిల్ల జిల్లాకు చెందిన జీహెచ్ఎం చొప్పదండి మండలంలో
- తన భార్య పనిచేస్తున్న పాఠశాలలో ఖాళీ ఉండగా.. దాన్ని వదులుకుని పక్క పాఠశాలకు బదిలీ అయ్యారు.

దరఖాస్తులో లేకున్నా.. ఆర్డర్‌లో ప్రత్యక్షం..

జమ్మికుంట మండలంలోని ఓ మహిళా జీహెచ్ఎం బదిలీ దరఖాస్తులో స్పౌజ్ పాయింట్లు వినియోగించుకోవడం లేదని ధ్రువీకరించింది. కానీ, బదిలీ ఆర్డర్‌లో మాత్రం స్పౌజ్ కేటగిరీలో 10 పాయింట్లు వినియోగించుకున్నట్లు చూపిస్తోంది. దీనివెనుక డీఈవో కార్యాలయ సిబ్బంది హస్తం ఉందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

పేదల కోసమే రూ.5కు భోజనం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: ఐదు రూపాయలకే భోజనం పేదలకు ఓ వరం లాంటిదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలో అన్నపూర్ణ పథకాన్ని మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రతీరోజు పక్కనే ఉన్న గ్రామాల నుంచి కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలతోపాటు పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని హరేకృష్ణ సంస్థ సహకారంతో రూ.5కే భోజన పథకం అమలు చేస్తున్నామన్నారు. దీనిద్వారా రోజూ సుమారు 300 మందికి భోజనం అందిస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ నిరంతరం ప్రజలతో ఉండి వారి యోగ క్షేమాలను పట్టించుకుంటున్నారని, ఆయన బాటలోనే ప్రతీరోజు నియోజకవర్గంతో పర్యటిస్తున్నామని చెప్పారు. ఈక్రమంలో పేదల పరిస్థితులు గమనించాక తక్కువ ధరకు భోజనం అందించాలన్న ఆలోచన వచ్చిందని డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, ఎంపీపీ తోట నారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీద పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోసం కాదు..

ఐదు రూపాయల భోజన పథకం, నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ, ఐటీ హబ్ ఏర్పాటు వంటి పనులు ఎన్నికల కోసమే చేస్తుస్తున్నారని, ఎన్నడూ ప్రజల కష్టాలు పట్టించుకోని కొందరు నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది అవాస్తవమని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా ఐదు రూపాయలకే భోజన పథకాన్ని ఏటా పొడిగిస్తామని కల్వకుంట్ల తెలిపారు. తన కుమారుడు డాక్టర్ సంజయ్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నా.. తాను ఎన్నడూ దూరంగా ఉండనని, ఎల్లవేళలా ప్రజాసేవలో కొనసాగుతానని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు స్పష్టం చేశారు.

ఎస్పీకి డీజీపీ అభినందన



కాన్ఫరెన్స్‌లో ఎస్పీ భాస్కర్, పోలీసు అధికారులు

జగిత్యాలక్రైం: జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు 10 హత్య కేసుల్లో 16 మందికి జీవితఖైదు పడేలా చర్యలు చేపట్టిన ఎస్పీ భాస్కర్‌ను డీజీపీ అంజనీకుమార్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభినందించారు. క్రైం ఫంక్షనల్ వర్టికల్స్, సైబర్ క్రైమ్‌పై డీజీపీ సమీక్షించారు. రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానాల్లో 135 కేసుల్లో జీవిత ఖైదులు విధించారని, 2022లో జగిత్యాల జిల్లాలో హత్యలకు సంబంధించిన ఒకే జీవితఖైదు విధించగా 2023లో జనవరి నుంచి ఇప్పటివరకు పోలీసులు తీసుకున్న ప్రత్యేక చర్యలతో 10 హత్య కేసుల్లో 16 మందికి జీవితఖైదీ కోర్టులు విధించాయని తెలిపారు. ఇందుకు కృషి చేసిన ఎస్పీ, అధికారులు, సిబ్బందిని డీజీపీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో పనిచేయాలని సూచించారు. ఎస్పీ భాస్కర్, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు వెంకటస్వామి, రవీంద్రకుమార్, రవీందర్‌రెడ్డి, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, రాజిరెడ్డి, రఫీక్ ఖాన్, సీఐ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



శిశువుతో సిబ్బంది

రాయికల్(జగిత్యాల): పట్టణానికి చెందిన చెర్ల లావణ్యకు సోమవారం వేకువజామున 3 గంటల సమయంలో పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లడంతో సకాలంలో వైద్యులు అందుబాటులో లేరు. దీంతో జగిత్యాలకు వెళ్లాలని వైద్య సిబ్బంది సూచించారు. 108 అంబులెన్స్‌లో జగిత్యాల మాతాశిశు సంక్షేమ కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పురిటినొప్పులు తీవ్రమయ్యాయి. ఈఎంటీ రాము, టెక్నీషియన్ రాము అప్రమత్తమై పురుడు పోయగా పాప జన్మించింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండగా, వారిని మాతాశిశు కేంద్రానికి తరలించారు. ఆమె బంధువులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మేనేజర్ సలీం, సూపర్‌వైజర్ రాజశేఖర్.. ఈఎంటీ రాము, టెక్నీషియన్ రాము, పైలెట్ మహేశ్‌ను అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధర్మపురి: ఇటీవల మెట్‌పల్లిలో నిర్వహించిన అండర్ –19 అథ్లెటిక్స్ పోటీల్లో తొమ్మిది మంది విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాధాకిషన్ మంగళవారం తెలిపారు. స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపినట్లు ఆయన వివరించారు. వారిని ప్రిన్సిపాల్‌తోపాటు ఫిజికల్ డైరెక్టర్ అంజయ్య, అధ్యాపకులు అభినందించారు.

22వ రోజుకు సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె

జగిత్యాలటౌన్: తమ సర్వీసులు క్రమబద్ధీకరించి విద్యాశాఖలో విలీనం చేయాలని కోరుతూ సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. నాయకులు మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, విద్యాశాఖ నియామకాల్లో ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. సమగ్రశిక్షా అభియాన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆగని అంగన్‌వాడీల సమ్మె

జగిత్యాలటౌన్: కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం 9వ రోజుకు చేరుకుంది. ఈమేరకు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగిస్తున్నారు. నాయకులు మాట్లాడుతూ కర్ణాటక వంటి రాష్ట్రాల్లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తున్నారన్నారు. మనప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరియర్స్‌ను వెంటనే చెల్లించడంతోపాటు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నియామకం



లక్ష్మణ్

ధర్మపురి: బీజేపీ ధర్మపురి అసెంబ్లీ కో కన్వీనర్‌గా బండారు లక్ష్మణ్‌ను నియమించారు. ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష్మణ్ గతంలో పార్టీ పట్టణ అధ్యక్షుడిగా, ప్రస్తుతం కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇటిక్యాల గ్రామంలో ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో సుమారు 150 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్యారంటీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2,500, రూ.500కు గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు కేవలం బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులే లబ్ధి పొందుతున్నారని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు అవకాశం ఇస్తే ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని అభయం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పరిశీలకుడు గంగాధర్, కిసాన్ సెల్ అధ్యక్షుడు వాకిటి సత్యం, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, ఎంపీటీసీ కొమ్ముల రాధ, నాయకులు మారంపల్లి గంగాధర్, రమేశ్, మధు, కాటిపల్లి గంగారెడ్డి, సుధీర్, లక్ష్మణ్, రాజేందర్, మురళీ, శ్రీనివాస్, ఏలేటి జలేందర్‌రెడ్డి, కొయ్యడి మహిపాల్‌రెడ్డి, మధు, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

గ్యారంటీ పథకాలను ఇంటింటికీ చేర్చాలి

మల్యాల(చొప్పదండి): వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇందులోని కొమ్ముల సుదర్శన్‌రెడ్డి, కొమ్ముల మహేశ్వర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, మల్యాల సింగిల్‌విండో డైరెక్టర్ సంత ప్రకాశ్‌రెడ్డి, సంత శ్రీధర్‌రెడ్డి తదితరులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ అన్నివర్గాల అభివృద్ధే ధ్యేయంగా సోనియా గాంధీ ప్రకటించిన కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. అభయహస్తంపై అవగాహన కల్పించాలని కోరారు. చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, మండలం అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల ఆస్పత్రికి కొత్తరూపు

- వైద్య, ఆరోగ్య కమిషనర్ అజయ్‌కుమార్

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు అవుతున్న వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనులను వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ అజయ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నివార్డులను ఆయన కలియ తిరిగారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు పెద్దమొత్తంలో నిధులు విడుదల చేస్తున్నారన్నారు. రూ.12.50 కోట్ల వ్యయంతో కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి పనులు కొనసాగుతున్నాయని, ఇవి త్వరలోనే పూర్తవుతాయని తెలిపారు. వచ్చేనెలలో ఆస్పత్రి ప్రారంభించి, ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేస్తామని అభయం ఇచ్చారు. డయాలసిస్ సెంటర్‌లో అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. గతంలో కన్నా ప్రసవాలు నాలుగింతలు పెరిగాయని, ఔట్‌పేషెంట్ల సంఖ్య పెరిగిందని చెప్పారు. భవిష్యత్‌లో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆయన వెంట స్టేట్ ప్రోగ్రాం అధికారి వాసుదేవరెడ్డి, డీసీఎస్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి సుదక్షిణదేవి, ఆర్‌ఎంవో రామకృష్ణ, కోరుట్ల ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీతరాణి, వైద్యులు ఇంతియాస్, లావణ్య, జగదీశ్వర్, వినోద్, శ్రావణ్, వేణుగోపాల్, శ్రీలక్ష్మి, నీలోఫర్ పాల్గొన్నారు.

పనులపై ఎమ్మెల్యేతో సమీక్ష

అజయ్‌కుమార్ కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి ఆస్పత్రి పనుల ప్రగతిపై సమీక్షించారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, డయాలసిస్ సెంటర్‌లో మరిన్ని వసతులు కల్పించాలని, సరిపడా వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు వినతి మేరకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ, వచ్చేనెలలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభిస్తామన్నారు.



అధికారులతో వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్

పేదలకు మెరుగైన వైద్యం

ధర్మపురి: రూ.కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందుతోందని వైద్య, విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ తెలిపారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు పట్టణంలో సుమారు.12 కోట్ల వ్యయంతో చేపట్టిన 50 పడకల మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి పనులను ఆయన పరిశీలించారు. సీహెచ్‌సిలో చేపట్టిన 10 పడకల ఐసీయూ విభాగాం నిర్మాణాన్ని తనిఖీ చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు. ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ప్రత్యేక శ్రద్ధతో పేదలకు నాణ్యమైన వైద్యం అందుతోందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలకు రూ.వేలు ఖర్చయితే, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. మాతాశిశు ఆస్పత్రితో పాటు ఐసీయూను వచ్చేనెలాఖరు వరకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. స్త్రీల వైద్యనిపుణులు, మత్తు తదితర విభాగాల వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. అనంతరం వైద్యులతో సమావేశమయ్యారు. వైద్య సేవలు, వసతులపై దిశానిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వైద్యుడు వాసుదేవరెడ్డి, డీసీహెచ్‌ఎస్ సుదాక్షిణాదేవి, సూపరింటెండెంట్ నవీన్ ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

రాయికల్(జగిత్యాల): కిష్టంపేట గ్రామానికి చెందిన కచ్చకాయలు గంగారెడ్డి, భార్య లక్ష్మి, కుమారులు రమేశ్, సురేశ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ మంగళవారం తెలిపారు. కిష్టంపేట గ్రామానికి చెందిన తొంగరి లవన్ భూమికి సంబంధించిన దారి విషయంలో లవన్‌ను కులం పేరుతో దూషించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

యువతి ఆత్మహత్య



ప్రవళిక(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): చింతకుంట గ్రామానికి చెందిన వేముల ప్రవళిక(19) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. ప్రవళిక చిన్నతనంలోనే తల్లిని కోల్పోయింది. అప్పటినుంచి నానమ్మ వద్దఉంటోంది. తండ్రి రాములు ఉపాధినిమిత్తం దుబాయిలో ఉంటున్నాడు. తల్లి లేకుండా ఎలా జీవించాలని మనస్తాపానికి గురైన ప్రవళిక.. ఆదివారం ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబసభ్యులు గమనించి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలి తాత గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

హత్యాయత్నంపై కేసు

రాయికల్(జగిత్యాల): రామారావుపల్లి గ్రామానికి చెందిన సింగతి మల్లయ్యపై హత్యాయత్నంలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ మంగళవారం తెలిపారు. ఈనెల 17న ఆస్తి గొడవల విషయంలో తన కోడలు భారతను చంపాలనే ఉద్దేశంతో కొడవలి తీసుకుని ఆమె ఇంటికి వెళ్లి హత్యయత్నం చేశాడు. భారత తండ్రి గడికొప్పుల మల్లయ్య ఫిర్యాదు మేరకు సింగతి మల్లయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

డ్రైవర్‌పై..

జగిత్యాలక్రైం: స్థానిక గాంధీనగర్ వద్ద జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఓ వ్యక్తి మృతికి కారకుడైన బొలారో వాహనం డ్రైవర్ జ్యోతికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రాంచందర్ సాహూ (35), అతడి స్నేహితుడు పప్పుకుమార్ కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం రాత్రి జగిత్యాలకు వస్తున్నారు. జగిత్యాల నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న బొలారో డ్రైవర్, నిజామాబాద్‌కు చెందిన జ్యోతికుమార్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో రాంచందర్ సాహూ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సంతోష్‌బాయి సాహూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

బావిలోపడి వృద్ధురాలి మృతి

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం కోమన్‌పల్లికి చెందిన మొగిలి శాంతమ్మ (80) ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందింది. ఎస్సై గౌతంపవార్ కథనం ప్రకారం.. శాంతమ్మ వృద్ధాప్యంతో బాధపడుతోంది. వినికిడి కోల్పోయింది. మతిస్థిమితం కోల్పోయింది. చాలాసార్లు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి మళ్లీ వచ్చేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కానీ, మధ్యాహ్నం వరకూ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించగా గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. బావి వద్ద చెప్పులు విడిచి ఉండడంతో తాగునీటి కోసం వెళ్లి కాలుజారి అందులో పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

మహిళలకు 33శాతం రిజర్వేషన్ చరిత్రాత్మకం

- బీజేపీ నాయకురాలు తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించడం కేంద్రప్రభుత్వం పనితీరుకు అద్దంపడుతోందని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ నాయకురాలు తుల ఉమ అన్నారు. మంగళవారం కలిగోట గ్రామంలో మహిళలతో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా బిల్లు కోసం ఏళ్లుగా పోరాటం చేసినా.. అప్పటి పాలకులు పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా మహిళా బిల్లును కేబినేట్‌లో ఆమోదింపజేయడం గర్వకారణమన్నారు. చట్టసభల్లో మహిళలుంటే వారి హక్కులు, సమస్యలపై చర్చించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందడం వెనుక తన కృషి ఉందంటూ ఎమ్మెల్సీ కవిత చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇటీవల రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యే టికెట్లు ఎంతమంది మహిళలకు ఇచ్చారో ఎమ్మెల్సీ కవిత ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుల ఉమ

భార్యను తీసుకొచ్చేందుకు వెళ్లి..



శ్రీనివాస్(ఫైల్)

ధర్మపురి: హైదరాబాద్‌లో ఉంటున్న తన భార్యను తీసుకొచ్చేందుకు వెళ్లి బైక్ అదుపుతప్పి స్థానిక దుర్గమ్మ కాలనీకి చెందిన శ్యామ్‌రావ్ శ్రీనివాస్(35) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. శ్రీనివాస్‌కు, అతడి భార్య శోభకు మధ్య కొద్దిరోజుల క్రితం కుటుంబ కలహాలు తలెత్తాయి. దీంతో శోభ తన పుట్టిల్లు హైదరాబాద్ వెళ్లింది. శ్రీనివాస్ తన పిల్లలతో కలిసి రెండు నెలల క్రితం భార్య వద్దకు వెళ్లాడు. అక్కడే లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఇద్దరు పిల్లలను తీసుకుని ధర్మపురి వచ్చాడు. భార్య కూడా ధర్మపురి వస్తానని చెప్పడంతో ఈనెల 17న తన ఆమెను తీసుకురావడం కోసం శ్రీనివాస్ తన పిల్లలతో కలిసి బైక్‌పై ధర్మపురి బయలు దేరాడు. హైదరాబాద్ సమీపంలోకి చేరుకోగానే మూర్ఛ రావడంతో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. గాయాలైనా శ్రీనివాస్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా ఈనెల 18న మృతి చెందాడు. కుమారుడు జైరాజ్, కూతురు సిరిక్షిక సురక్షితంగా బయటపడ్డారు. శ్రీనివాస్ అకాల మరణంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. బీజేపీ నాయకులు సారంగుల అమర్‌నాథ్, రాంసుధాకర్ అతడి అంత్యక్రియల కోసం రూ.15వేలను మృతుడి సోదరి నాగలక్ష్మి బ్యాంకు ఖాతాలో జమచేశారు.

జీవితంపై విరక్తి చెంది.. బ్లేడ్‌తో మెడ కోసుకుని..

ధర్మపురి: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి.. బ్లేడుతో మెడ కోసుకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. పట్టణానికి చెందిన కొదురుపాక శ్రీనివాస్(45) కొన్నేళ్ల నుంచి షుగర్, బీపీ, టీబీతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం ఉన్నదంతా ఊడ్చిపెట్టాడు. చేతిలో చిల్లిగవ్వ లేక జీవితంపై విరక్తి చెందాడు. ఈనెల 17న బ్లేడ్‌తో మెడ కోసుకోగా తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా ఈనెల 18న రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందింది. తల్లి మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మెట్‌పల్లి సబ్‌కోర్టు పీపీగా మురళి



జగిత్యాలజోన్: జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న సాయిల్ల మురళిని మెట్‌పల్లి సబ్‌కోర్టు ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆయన మెట్‌పల్లి సబ్‌కోర్టులో క్రిమినల్ కేసుల్లో పూర్తిస్థాయి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించనున్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్య

- భూ వివాదాలే కారణమా..?
- నిందితుల కోసం పోలీసుల గాలింపు



లింగయ్య (ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి, కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మేకల లింగయ్య సోమవారం రాత్రి దారుణహత్యకు గురయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. లింగయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని సమస్యాత్మక భూములను కొంటూ.. వాటిని పరిష్కరించి.. విక్రయాలు చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ భూమి విషయంలో లింగయ్యకు.. మరికొందరికి వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో లింగయ్య రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో పెంపుడు కుక్కతో ప్రధాన రహదారి నుంచి పవర్‌ప్లాంట్‌కు వెళ్లే దారిలో వాకింగ్ చేస్తున్నారు. అప్పటికే మాటు వేసిన దుండగులు లింగయ్యపై వేట కొడవళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్, రామగుండం సీఐ చంద్రశేఖర్ గౌడ్, ఎన్టీపీసీ ఎస్సై జీవన్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కృష్ణాష్టమి రోజే హత్యకు ప్లాన్..?

లింగయ్యను హత్య చేసేందుకు నిందితులు కృష్ణాష్టమి రోజే ప్రత్యర్థులు ప్రయత్నించి విఫలమైనట్లు తెలుస్తోంది. అనంతరం వినాయక చవితి పండుగపూట రోడ్లపై ఎవరూ ఉండరని, హత్యకు అదే అనువైన సమయమని దుండగులు భావించినట్లు సమాచారం. సుమారు 12 రోజులపాటు గస్తీ నిర్వహించి.. వాకింగ్‌కు వెళ్లే సమయం అనుకూలమని నిందితులు నిర్ధారించుకుని పక్కా ప్లాన్ ప్రకారమే రాత్రి సమయంలో లింగయ్య వాకింగ్ చేస్తుండగా.. వేట కొడవళ్లతో దాడి చేసి అతి కిరాతకంగా హత్య చేసినట్లు తెలుస్తోంది.

నాడు అన్న.. నేడు తమ్ముడు

ఖాజీపల్లికి చెందిన లింగయ్యతో కలిపి ఐదుగురు అన్నదమ్ములు. లింగయ్య అన్న రాజయ్య 1991 ఏప్రిల్ 4న పొలం పనులకు వెళ్లి ఇంటికొస్తుండగా ఇంటి సమీపంలోనే ప్రత్యర్థులు కత్తులతో దాడి చేసి అతి కిరాతకంగా హత్య చేశారు. కుటుంబంలో చిన్నవాడైన మేకల లింగయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. తాజాగా అతడి హత్య జరిగిన 32 ఏళ్ల తర్వాత లింగయ్యను కూడా అలాగే హతమార్చడం స్థానికంగా సంచలనం సృష్టించింది.

పోలీస్ పహారా మధ్య ఖాజీపల్లి

లింగయ్య హత్యలో ఓ అనుమానితుడి ఇంటి ప్రహరీని లింగయ్య కుటుంబసభ్యులు కూల్చివేశారు. దీంతో ఖాజీపల్లిలో పోలీసులు భారీగా మోహరించారు. లింగయ్య అంత్యక్రియల సమయంలోనూ గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పహారా కొనసాగించారు. డాగ్‌స్క్వాడ్‌తో దర్యాప్తు చేస్తున్నారు. భూ వివాదాలే హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధితుడి కూతురు మేకల సుప్రజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితుల కోసం ప్రత్యేక బలగాలు గాలింపు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

పెరుగుతున్న జ్వరపీడితులు

- అదుపులోకి రాని జ్వరాలు
- ఆందోళన కలిగిస్తున్న డెంగీ కేసులు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో జ్వరాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. వారం రోజుల క్రితం ఐదుగురికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. విష, వైరల్ జ్వరాలతో మరికొందరు బాధపడుతున్నారు. గ్రామంలో సుమారు 3 వేల వరకు జనాభా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వసతులు కల్పించినా.. తక్కువమంది జ్వరపీడితులు వెళ్తున్నారు. చాలామంది ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. డెంగీబాధితులకు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు అధికంగా బిల్లులు వేస్తున్నాయని బాధితులు చెబుతున్నారు. గ్రామంలో 50 మందికిపైగా జ్వరాలతో బాధపడుతున్నారని, అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చాలారోజుల తర్వాత శానిటేషన్..

పంచాయతీ అధికారులు చాలారోజుల తర్వాత పారిశుధ్య పనులు చేపట్టారు. జ్వరపీడితుల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యశిబిరాలు నిర్వహించాలని సింగిల్‌విండో చైర్మన్ పాల్సాని నవీన్‌రావు కోరారు. కాగా, జిల్లా మాతాశిశు సంరక్షణాధికారి జయపాల్ రెడ్డి వివరణ ఇస్తూ ఇప్పటివరకు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి ఒక డెంగీ కేసు వచ్చిందన్నారు. బాధితుడిని డిశ్చార్జీ చేశామని తెలిపారు. గ్రామంలో ఇప్పటికే ఒకరోజు వైద్యశిబిరం నిర్వహించామని, మళ్లీ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఇబ్బందులు కలిగించొద్దు

జగిత్యాలక్రైం: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని టౌన్ ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అన్ని వర్గాలతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మండపాల వద్ద ఇతరులకు ఇబ్బందులు కలిగించొద్దని అన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి(ధర్మపురి): అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేయాలని చూస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలు అమలు చేయాలని, అప్పుడే తెలంగాణలో ఓట్లు అడగాలని మంత్రి సూచించారు. కాగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కేంద్రాన్ని మంత్రి జిల్లా వైద్యాధికారి శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వ్యాధి నివారణ త్వరగా చేయవచ్చని మంత్రి అన్నారు. జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి ఈశ్వర్‌కు తిలకం దిద్దుతున్న మహిళ

హైకోర్ట్‌కు చేరిన మెట్లచిట్టాపూర్ భూముల వ్యవహారం

- పనులపై స్టేటస్ కో ఇచ్చిన కోర్టు

మెట్‌పల్లిరూరల్: మెట్లచిట్టాపూర్ గ్రామ శివారులోని భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు వ్యవహారం హైకోర్టుకు చేరింది. వివరాలు.. గ్రామ శివారు సర్వే నంబరు 498, 506లోని భూముల్లో ఇండ్రస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. అయితే, గత ప్రభుత్వం తమకు అక్కడ భూములు ఇచ్చిందని పేర్కొంటూ రైతులు ప్రత్యక్ష ఆందోళనలు చేశారు. అంతేకాదు.. 25 మంది రైతులు కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ ద్వారా హైకోర్టును ఆశ్రయించారు. ఇందులో తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, టీఎస్‌ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్‌చైర్మన్, జగిత్యాల జిల్లా కలెక్టర్, టీఎస్‌ఐఐసీ కరీంనగర్ జోనల్ మేనేజర్, ఇండస్టియల్ డెవలప్‌మెంట్ జగిత్యాల జిల్లా మేనేజర్, మెట్‌పల్లి ఆర్డీవో, తహసీల్దార్‌ను ప్రతివాదులుగా చేర్చారు. పిటిషన్‌ను స్వీకరించిన కోర్టు.. వాదనలు విని రైతుల సమస్యలతో పాటు ఇతర అంశాలను పరిగణలోనికి తీసుకోవాలని సూచించింది. తదుపరి తీర్పు ఇచ్చేంతవరకూ అక్కడ పనులు చేయొద్దని స్టేటస్‌కో జారీ చేసింది. కాగా, మెట్లచిట్టాపూర్ శివారు భూముల్లో పనులు చేపట్టవద్దని కోరుతూ టీజేఎస్ నాయకులు, రైతులు మంగళవారం మెట్‌పల్లి తహసీల్దార్ శేఖర్, ఆర్డీవో కార్యాలయ ఉద్యోగికి ఉత్తర్వుల ప్రతులను వినతిపత్ర రూపంలో అందజేశారు. టీజేఎస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్ రెడ్డి, నాయకులు శంకర్, ముత్తన్న, నరేశ్, రమేశ్, శ్రీనివాస్, తరుణ్, రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు, రైతులు

తైక్వాండో విద్యార్థుల ప్రతిభ



కోరుట్ల: పట్టణానికి చెందిన కోరుట్ల తైక్వాండో క్లబ్ విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన డిస్ట్రిక్ట్ తైక్వాండో అసోసియేషన్ చాంపియన్‌షిప్‌లో 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 26 మంది 11 గోల్డ్ మెడల్స్, 6 సిల్వర్ మెడల్స్, 9 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరు తెలంగాణ ఇంటర్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సంతోష్ కుమార్, జిల్లా ప్రెసిడెంట్ కోల రంగారావు, కోచ్ నేతాజీ అభినందించారు.

అంజన్నకు మొక్కులు



కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. టీవీ, చలనచిత్ర అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుర్మాచలం అనిల్ పూజలుచేశారు.

సమస్యలు పరిష్కరించండి



రాయికల్: ఆదివాసీ నాయకపోడు సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ దళితహక్కుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్సెంగ వేణు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.